తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్

ఆదివారం
3 మే 2026

పేజీలు - 8




## ఫేస్‌యాప్ అటెండెన్స్‌తో ఇబ్బందులు

### ముఖానికి మసి, పేస్ పౌడర్ పూసుకుంటేనే ఫేస్ యాప్ అటెండెన్స్ ఓకే...

**చెన్నారావుపేట, మే 02( జనం సాక్షి):** ఫేస్ యాప్ అటెండెన్స్ తో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని పెద్ద చెరువులో గత కొద్దిరోజులుగా పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ప్రతిరోజు 110 మంది కూలీలు ఉపాధి హామీ పనులను చేపడుతున్నారు. గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గుగులోతు రమేష్ ఫేస్ యాప్ లో కూలీల ఎన్ ఎంఎస్ అటెండెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. శనివారం పేస్ యాప్ లో ఎన్ఎంఎస్ అటెండెన్స్ తీసుకుంటుండగా ఫేస్ నాట్ మ్యాపింగ్ అని రావడంతో కూలీలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అంతేకాక దేనబోయిన రామలింగు అనే కూలీ ముఖానికి మసి పూసుకొని ఫోటో దిగడంతో ఫేస్ మ్యాపింగ్ ఎంఎంఎస్ అటెండెన్స్ తీసుకుంది. అదేవిధంగా సంగెం కుమారస్వామి, రుద్రు నరసయ్యలు ముఖానికి ఫేస్ పౌడర్ వేసుకోగా ఫేస్ మ్యాపింగ్ ఎన్ఎంఎస్ అటెండెన్స్ తీసుకోవడం గమనార్హం. ప్రతిరోజు ఫేస్ మ్యాపింగ్ అటెండెన్స్ తో ఒక్కొక్కరికి 10 నిమిషాల సమయం పడుతుందని ఫేస్ మ్యాపింగ్ తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





## వైభవంగా నరసింహుని రథోత్సవం

శిఖాంజనేయస్వామికి సింధూరంతో స్నాపనం, అభిషేకం చేసిన అర్చకులు



మంగపేట, మే02 (జనంసాక్షి) : మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం మల్లూరు క్షేత్రంపై కొలువుతీరిన శిఖాంజనేయ స్వామికి సింధూరంతో స్నాపనం చేసి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేక కార్యక్రమాన్ని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీ కృష్ణమాచార్యుల బృందం యాజ్ఞకులు అమరవాది రామ నరసింహాచార్యులు, శ్రీపెరంబుదూరు మదన మోహనాచార్యులు, మణిదీపాచార్యులు, భరద్వాజాచార్యులు, సాయి వెంకటాచార్యులు, కారంపూడి శ్రీనివాస విరంచిచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం 8 గంటల సమయంలో చతుస్నానార్చన నిర్వహించి అనంతరం శిఖాంజనేయ స్వామికి సింధూరంతో స్నాపనం అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మి సహస్రనామ స్తోత్ర పారాయణం, హవనం నిర్వహించి సాయంత్రం 7 గంటలకు సమయానంలో స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హేమాచల క్షేత్రం నుండి మిగతా 8లో..

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 02(జనంసాక్షి ):** జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్క లబ్ది దారుడికి సంక్షేమ పథకాలు అందజేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం లోని ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక నియోజక వర్గ స్థాయి సమావేశామునకు అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మట్, ఎం.డెవిడ్, ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఇరుకుళ్ళ మంగ, ఆసిఫాబాద్ మునిసిపల్ చైర్మన్ మొంగ్రె ఆకాష్, వైస్ చైర్మన్ యం. డి అహ్మద్ , ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వార్ రావు తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అర్హులైన లబ్ది దారులకు పథకాలు అందిస్తున్నదని కలెక్టర్ అన్నారు. ఆసిఫాబాద్ నియోజక వర్గ స్థాయి లో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 24209 మందికి చేయూత పెన్షన్ దారులకు 22 కోట్ల 50 లక్షల రూపాయలను అందించిందన్నారు. 2వ విడతలో ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ది దారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మార్చి 6 నుండి జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా పారిశుధ్యం, ఫైళ్ళ క్లియరెన్స్, రహదారి బద్రత , సంక్షేమ వారం, డ్రగ్స్ నివారణ, వంటి కార్యక్రమాలను ప్రజా ప్రతి నిదుల సహాకారంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 4 నుండి 9 వరకు రైతు వారోత్సవ కార్యక్రమములో ప్రజా ప్రతి నిధులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఇళ్ళ గణన కార్యక్రమములో భాగంగా మే 10 వరకు ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాలన్నారు. ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తిసుకున్నప్పటి నుండి కలెక్టర్ ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి నిధులు మంజూరి చేసి మారు మూల గ్రామాలకు త్రాగు నీరు అందించాలన్నారు. రహదారి సౌకర్యాలు కల్పించడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమములో అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు,ఎం పి డి ఓ లు, పంచాయతి కార్యదర్శులు, స్వయం సహాయక మహిళా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.



## ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

- హనుమకొండ లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం
- ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించిన కలెక్టర్

**హనుమకొండ, ప్రతినిధి మే 2 (జనం సాక్షి) :** హనుమకొండ ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలు నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పెండింగ్ బిల్లులు, సర్జికల్ ఐటమ్స్,మెడిసిన్స్, ఆసుపత్రి నిర్వహణ, బడ్జెట్, ఆసుపత్రికి కావాల్సిన వనరులు, తదితర అంశాలపై చర్చించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను, ఆసుపత్రి నిర్వహణ గురించి ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్పర్సన్ అయిన జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, ప్రసవం, ప్రసవానంతర వైద్య సేవలకు చికిత్సకు వచ్చే వారికి నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆసుపత్రి నిర్వహణ బాగుండాలన్నారు. ఆసుపత్రిలో అన్నీ మందులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రధాన భవనానికి రంగులు వేసేందుకు మిగతా 8లో..

## సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

### టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాదుర్గం వెంకటేష్



**బచ్చన్నపేట మే 2(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం ఒక్క టిడిపి తోనే సాధ్యమని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు అల్లాదుర్గం వెంకటేష్ అన్నారు. శనివారం ఎన్.టి.ఆర్ ట్రస్ట్ భవన్ లో రెండవసారి పొలిటి బ్యూరో సభ్యునిగా ఎన్నికైన బక్కని నరసింహులును హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టిడిపి చేసిన అభివృద్ధి తప్ప వేరే ఏమీ కనిపించడం లేదని మళ్లీ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీకి ప్రజలు పట్టం కట్టాల్సిందేనని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే అనగారిన కులాలకు న్యాయం జరుగుతుందని బలహీన వర్గాలు మోసే జెండానే తెలుగుదేశం జెండా అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ బీసీ సెల్ అధ్యక్షులు అధ్యక్షులు శ్రీపతి సతీష్. ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలంపల్లి అశోక్. గూడెపు రాఘవులు.ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్. శంకర్ రావు

## రైతుల కష్టాల్లో రాజకీయం వెతుకుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి

### చెన్నారావుపేట మాజీ సొసైటీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి



**చెన్నారావుపేట, మే 2( జనం సాక్షి):** నర్సంపేట నియోజకవర్గంలో మొక్కజొన్న రైతుల సంక్షేమం పట్ల ప్రస్తుత శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తుంటే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాత్రం రైతుల కష్టాల్లో రాజకీయ లబ్ధి కోసం ఆశ పడటం సిగ్గుచేటని చెన్నారావుపేట మాజీ సొసైటీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నియోజకవర్గ రాజకీయ పరిణామాలపై ఘాటుగా స్పందించారు.ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మొక్కజొన్న రైతులకు అండగా ఉంటూ, పండించిన పంటను మార్కెట్ నుండి త్వరితగతిన తరలించేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని చెన్నారెడ్డి కొనియాడారు. వర్షాల వల్ల రైతుకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ఆయన రవాణా వ్యవస్థను స్వయంగా పర్యవేక్షిస్తూ, రైతుల మేలు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీరు అత్యంత దారుణంగా ఉందని చెన్నారెడ్డి మండిపడ్డారు. ఎప్పుడు వర్షాలు పడతాయా.. ఎప్పుడు రైతుల మొక్కజొన్నలు, ధాన్యం తడిసి ముద్దవుతుందా.. ఆ కష్టాన్ని చూసి ఎప్పుడు దొంగ ఏడుపు ఏడుస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేద్దామా?" అని పెద్ది ఎదురుచూస్తున్నట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. రైతులు నష్టపోవాలని కోరుకుంటూ, ఆ నష్టం మీద రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూడటం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. రైతుల పట్ల నిజమైన ప్రేమ ఉన్న నాయకుడు ఎవరో, కేవలం విమర్శల కోసమే వేచి చూసే నాయకుడు ఎవరో నర్సంపేట నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా పెద్ది సుదర్శన్ రెడ్డి తన కుటిల రాజకీయాలను మానుకోవాలని, రైతుల శ్రేయస్సు కోరేలా ప్రవర్తించాలని తొగరు చెన్నారెడ్డి హితవు పలికారు.

## ఉపాధిహామి పనిస్థలాల పరిశీలన

### ఎంపిడిఓ క్రాంతికుమార్



**మల్హర్, మే02(జనంసాక్షి)** మండలం లోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ వర్క్ సైట్ ను విజిట్ చేసిన ఎంపీడీఓ కే. క్రాంతి కుమార్, ఎపి ఓ జి.హరీష్. ఉపాధి హామీ పథకంలో గత సంవత్సరంతో పోలిస్తే మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో హక్కుదారుల సంఖ్య చాలా తక్కువగా ఉందని వచ్చే వారం నుండి హక్కుదారుల సంఖ్య పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు,పంచాయతీ కార్యదర్శి కి సూచించడం జరిగింది. ఉపాధిహామీ కూలీలు ఉదయాన్నే పని ప్రదేశానికి చేరుకొని ఎండ తీవ్రత కాకముందు ఇంటికి వెళ్లాలని సూచించడం జరిగింది. పని ప్రదేశంలో నీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శి రాజు కు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల లింగయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత,మెటీలు నరేష్ మహేష్ పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత దుర్గం కృష్ణస్వామికి యువత సన్మానం



**నెన్నెల్ మే 2 (జనం సాక్షి)** నెన్నెల్, మే 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన దళిత రత్న అవార్డు గ్రహీత దుర్గం కృష్ణస్వామిని స్థానిక యువత ఘనంగా సన్మానించింది. సమాజానికి సేవ చేస్తూ అందరికీ అండగా నిలుస్తున్న కృష్ణస్వామికి ప్రభుత్వం ఈ అవార్డు అందించడం పట్ల యువత ఆనందం వ్యక్తం చేసింది. సమాజ సేవలో నిమగ్నమైన వారికి, యువతకు ఈ అవార్డు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి మాట్లాడుతూ డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను ఆచరిస్తూ ప్రతి ఒక్కరూ తమ వంతు సేవ చేయాలని సూచించారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు అంబేద్కర్ ఆలోచనలను పరిచయం చేసి, ఆయన రచనలు చదివే అలవాటు పెంపొందిస్తే రాబోయే తరాలు సన్మార్గంలో నడుస్తాయని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని చదవాలని సూచించారు. తనను గుర్తించి దళిత రత్న అవార్డు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఉత్సవాల కమిటీ సభ్యులకు, అలాగే సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గం దేవయ్య, తాళ్లపల్లి లింగన్న, తాళ్లపల్లి ప్రవీణ్, దుర్గం వెంకటస్వామి, గట్టు రాజలింగు, జాడి రవి, గొర్లపల్లి వంశీ, దుర్గం హన్మంత్, ప్రేమ్ కుమార్, గొర్లపల్లి మల్లేష్, పచ్చ పవన్ కళ్యాణ్, సాగర్, విఘ్నేష్ తదితరులతో పాటు నేతకాని మహర్ సేవా సంఘం యువత పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో దగ్ధమైన పంటను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



**కుబీర్, మే 02, (జనంసాక్షి):** విద్యుత్ షాక్‌తో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి హామీ ఇచ్చారు. కుబీర్ మండలంలోని పార్డి (కె), దార్ కుబీర్ గ్రామాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సాగు చేసిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న విఠల్ రెడ్డి శనివారం బాధిత రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. ఏడాదంతా కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అగ్నిప్రమాదానికి గురికావడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దురదృష్టకర సంఘటనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణ సహాయం అందించాలని ప్రభుత్వానికి విన్నవిస్తానని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో మండల నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తూరులో టిబి ముక్త భారత్ వైద్య శిబిరం నిర్వహణ



**నెన్నెల్, మే 2 (జనం సాక్షి)**శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తూరు గ్రామపంచాయతీలో టిబి ముక్త భారత్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి, క్షయవ్యాధి నివారణ అధికారి సుధాకర్ నాయక్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించి వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవగాహనలో భాగంగా పోస్టర్లు విడుదల చేసి ప్రజలకు వివరించారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఉచిత చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల వెయ్యి రూపాయల పోషణ భత్యం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి త్వరగా వ్యాపిస్తుందని, అందుకే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. త్వరగా నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి, పొగాకు నమిలే వారికి ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు.ఈ శిబిరంలో అవసరమైన వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. తెమడ పరీక్ష కోసం 12 మందికి నమూనాలు సేకరించగా, ఎక్స్ రే అవసరం ఉన్న 81 మందికి ఇంటి వద్దకే పోర్టబుల్ ఎక్స్ రే యంత్రంతో పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తలండి రాజేశ్వరి, ఆరోగ్య సిబ్బంది సౌమ్య, పూజిత, క్షయవ్యాధి పర్యవేక్షకుడు శ్రీపెల్లి శశికాంత్, హెల్త్ అసిస్టెంట్ రాజ్ కుమార్, ఎక్స్ రే టెక్నీషియన్ పవన్, ఎఎన్ఎంలు బుచ్చమ్మ, అమృత, ఆశ కార్యకర్తలు అరుంధతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో నాటుబాంబుల కలకలం

**దస్తురాబాద్, మే 02 (జనంసాక్షి)::**మండల కేంద్రంలోని దేవునిగూడెం గ్రామ సమీపంలో శనివారం నాటుబాంబులు కలకలం సృష్టించాయి. వివరాల్లోకి వెళితే దేవునిగూడెం గ్రామ శివారులో గల అటవి సమీపంలో వన్యప్రాణుల వేటకోసం వేటగాళ్లు నాటుబాంబులు అమర్చారు. మేత కోసం అటుగా వెళ్లిన గేదెలు నాటుబాంబులు కొరకడంతో తీవ్ర గాయాల పాలయ్యాయి. గత కొద్ది రోజులుగా నాటు బాంబులతో అడవి పందులను, జింకలను ఇతర వన్యప్రాణులను వేటగాళ్లు వేటాడుతున్నట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ అజయ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలన చేశారు. స్థలాన్ని పరిశీలన చేసిన అనంతరం సీఐ మాట్లాడుతూ వన్య ప్రాణుల కొరకు పెట్టిన నాటు బాంబులు గేదలు తినడం వల్ల ఘటన జరిగిందని ఆయన తెలిపారు.ఇటువంటి సంఘటనల వల్ల మూగ జీవాలు చనిపోవడం జరుగుతుంది అని అలా జరుగకుండా ముందు జాగ్రత్తగా ఎవరైనా అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



# ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనం సాక్షి):** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బోరంచు శ్రీకాంత్ రెడ్డిని వరించింది. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాల యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా అధికారులు ఆయనతో బాధ్యతలు స్వీకరింప జేశారు .అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కుటుంబ సభ్యుల సమక్షంలో శ్రీకాంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గారికి, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి, ప్రభుత్వ సలహాదారు పెద్ది సుదర్శన్ రెడ్డి గారికి, రాజ్యసభ సభ్యులు మరియు ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేముల నరేందర్ రెడ్డి గారికి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి తాను కట్టుబడి పనిచేస్తానని, రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ , వివిధ రైతు మరియు కుల రాజకీయ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పురుగు మందులతో లింకు లేకుండా విత్తనాలు, ఎరువులను అందజేయాలి

**నల్లబెల్లి, మే 02 (జనంసాక్షి):** పురుగు మందులతో లింకు లేకుండా విత్తనాలు, ఎరువులను రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి మామిండ్ల పెద్ద ఐలయ్య అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎరువులు, విత్తనాలను సకాలంలో అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్లో ఎరువులు కావాలంటే పురుగు మందులతో లింకులు పెట్టి రైతులను దోచుకున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో కాంప్లెక్స్ ఎరువులు పంపించకపోవడం వలన రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని వివరించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా కాంప్లెక్స్ ఎరువులు,



విత్తనాలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎరువులతో పురుగుమందులను లింకు రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భూస కుమారస్వామి, గాదం రవి పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ బ్యూరో, మే 02 (జనం సాక్షి**మెడికల్ విద్యకు సంబంధించి రేపు జరిగే నీట్ ప్రవేశ సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో( హన్మకొండ 04,వరంగల్ 02, కాజీపేట 3,జనగామ 2 వున్నాయి ) రేపు మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించబడుతుందని . పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.

-1. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు.-2. సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం.-3. పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 03-05-26 ఉదయం 06:00 గంటల నుండి సాయంత్రం 06:00 గంటల వరకు మూసివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు

# పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందన సన్మానం

## ఎడపల్లి సర్పంచ్. నీలారాణి



**మహదేవపూర్ మే 2 (జనంసాక్షి)** ఐటీశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో ఎడపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మోతే నీలారని సాంబయ్య, శనివారం రోజున పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన ఎడపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మోతే నీలారాణి సాంబయ్య సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు వివిధ పాఠశాలలో గట్టి పట్టిదనితో విద్యను అభ్యసించి మంచి మార్కులతో లేని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మహేష్. ఉపసర్పంచ్ గోగుల రాజమద్దుల కృష్ణ . వార్డు సభ్యులు కన్నూరి పద్మ రవి కుమ్మరి రాజమణి ఉపేందర్ చిన్నారి శ్యామ్ కుమార్. గ్రామ పెద్దలు తల్లిదండ్రులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# మహారాష్ట్ర మంత్రికి సన్మానం

## ఆదివాసి సీనియర్ నాయకులు

**మహదేవపూర్: మే 2 (జనంసాక్షి ):** మహారాష్ట్ర మంత్రి ధర్మారావు బాబా అత్రం ఆహేరి ఎమ్మెల్యే ను మహదేవపూర్ మడ కార్యాలయంలో తుడుము దెబ్బ సీనియర్ నాయకులు వాడే కుమార్ , ఆదివాసీ నాయకులు కాలనేని రాములు, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మాడే సత్యనారాయణ, గావిడి కొమ్మయ్య, బండ్ల రాజేష్, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

# కాలిన మొక్కజొన్న పంట పరిశీలన

**పెంబి,మే 2, (జనంసాక్షి)**



ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలం లో షార్ట్ సర్క్యూట్ తో 6 ఎకరాల్లో దగ్ధమైన పంట చేను పరిశీలించిన నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందనీ, ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటన రైతుకి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. పంట కాలిపోయిన విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పందించి, ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది నీ తగిన చర్యలకు ఆదేశాలు ఇచ్చారనీ ఏం ఎల్ ఏ తెలిపారు .దగ్ధానికి గురైన పంట నష్టం మొత్తాన్ని అధికారులు క్షుణ్ణంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించా లని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు .రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. వేసవిలో రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండి అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత శాఖకు సమాచారం అందిస్తే కొంతైనా నష్ట నివారించ వంచని తెలిపారు .ఈ కార్యక్రమంలో రైతులు , వ్యవసాయశాఖ అధికారులు స్థానికులు ,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

**దస్తురాబాద్, మే 02 (జనంసాక్షి)::**మండలంలోని ఆకోండపేట్ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి సైకిలును టాటా ఏస్ వాహనం ఢీ కొన్న ఘటనలో సైకిల్ పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పాండ్వాపూర్ గ్రామానికి చెందిన కురుసెంగ మారుతి (70) గా గుర్తింపు. మృతుడు స్థానికంగా అకొండపేట గ్రామ సమీపంలో ఉన్న మామిడి తోటలో కాపలాగా పని చేస్తున్నట్లు ప్రాథమిక సమాచారంగా పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలో వారసంత ఉండడంతో కూరగాయలు కొనుగోలు చేసి మామిడి తోటకు వెళ్లే క్రమంలో అకొండపేట గ్రామానికి చెందిన టాటా ఏస్ వాహనం ఎదురుగా వచ్చి బలంగా డీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రైతులు నానో యూరియా వాడాలి

## బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



**బెల్లంపల్లి, మే 2, (జనంసాక్షి)**రైతులు నానో యూరియా వాడాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పిలుపునిచ్చారు. శనివారం బెల్లంపల్లి మండలం కన్నాల ఆర్పీ గార్డెన్లో రైతులకు నానో యూరియాపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో నానో యూరియా, నానో డీఏపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు సబ్సిడీపై వేపనూనె అందించారు. నానో డీఏపి, నానో యూరియా ప్రోత్సహించాలని, రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహనా కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులు యూరియా, డీఏపి బదులు నానో యూరియా, నానో డీఏపి వాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ ఏడిఏ రాజనరేందర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, బెల్లంపల్లి ఏఓ సుద్దాల ప్రేమ్ కుమార్, కాసిపేట ఏఓ ప్రభాకర్, తాండూర్ ఏఓ సుష్మ, కన్నెపల్లి ఏఓ ప్రశాంత్, వేమనపల్లి ఏఓ వీరన్న, బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



**దస్తురాబాద్, మే 02 (జనంసాక్షి):** :మండలంలోని దేవునిగూడెం గ్రామ పంచాయితీలో శనివారం హనుమాన్ ఆలయ కమిటీని ఎన్నుకోవడం జరిగి ంది అని ఆలయ అర్చకుడు రాజేష్ తెలి పారు. ఆయన మాట్లాడుతూ ఆలయా అభివృద్ధి కొరకు ఈ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అధ్యక్షుడు గా గుజ్జుల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా బొమ్మెన శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ముస్కె అంజన్న ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన అన్నారు. అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

## జేఎస్టీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్




**మహబూబాబాద్ బ్యూరో, మే 02(జనం సాక్షి)** :విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలువాటు పడి తమ బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని జేఎస్టీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్ అన్నారు.శనివారం పట్టణంలోని మహబూ బాబాద్ జేఎస్టీహె చ్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదక దవ్యాల పై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సద స్సులో మహబూబాబాద్ టౌన్ సిఐ అంజలి, ఎస్సై గడ్డం ఉమ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు మాదక ద్రవ్యాల గురించి క్లుప్తంగా వీడియో మాధ్యమాల ద్వారా వివరించి వారికి అవగాహన కల్పించారు. అదే కాకుండా భవిష్యత్తులో ఎలా జీవనాన్ని కొనసాగించాలి పై చదువులకు ఎలా వెళ్లాలి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని వారు వివరించారు ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్ స్టాఫ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలి



**పాలకుర్తి, మే 02(జనంసాక్షి)** ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలని. జనగాం జెడ్పీ సీఈవో బీ. రంగారావు అన్నారు. శనివారం మండల కేంద్రం లోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఫంక్షన్ హాలులో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సీఈవో బి. రంగారావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తుందన్నారు. ఈ పథకాల అమలు బాధ్యత అన్నీ శాఖల అధికారులపై ఉందన్నారు. మహిళా పొదుపు సంఘాల అభివృద్ధికి వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లను మంజూరి చేస్తోందని, అదే విధంగా బస్సులను నడుపుకోవడానికి కూడా బస్సును మంజూరి చేస్తోందన్నారు. అర్హులందరికి రేషన్ కార్డులు అందిస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి తదితర రంగాల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. అర్హులైన పేదలం దరికి సంక్షేమ పథకాలు అందించేలా ప్రతి అధికారి పని చేయాలని సూచించారు. రేషన్ కార్డులు లేని వారు గతంలో అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కలబ్దిదారు డికి ప్రభుత్వం రేషన్ కార్డు అందచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ ఓ మల్లికార్జున్, హౌజింగ్ అధికారి మాత్రు నాయక్, పాలకుర్తి తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో వేధవతి, మార్కెట్ చైర్మన్ లావుడ్యా మంజుల, సీఐ జానకిరాంరెడ్డి, ఏస్సై పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వరి కోత మిషన్ల యజమానులకు అవగాహన సదస్సు



**చిట్యాల, మే 02( జనం సాక్షి )**:మండలంలోని వరి కోత మిషన్ యజమానులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండల అధికారుల సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్, డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, చల్లగరిగ ఏఈఓ దీపక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి కోత సమయంలో ధాన్యం తాలు లేకుండా, శుభ్రంగా వచ్చేలా చూడాలని యజమానులకు,ఆపరేటర్లకు ఆదేశాలు జారీ చేశారు.మిషన్ ఇంజిన్ ఆర్ పి యం 18 నుండి 20 మధ్య మాత్రమే ఉండాలని,కోత కోసే సమయంలో బ్లోయర్ తప్పనిసరిగా ఆన్ చేసి ఉంచాలని కోరారు. దీంతో ధాన్యంలోని చెత్తాచెదారం తొలిగిపోయి నాణ్యమైన వడ్లు వస్తాయన్నారు.మిషన్ వేగాన్ని నియంత్రిస్తూ బీ,టు -- ఏ, వన్ గేర్లలో మాత్రమేనడ పాలనిఆదేశించారు.రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత హార్వెస్టర్ యజమానులపై ఉందని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి, ధాన్యం నాణ్యత దెబ్బతింటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పోచంపల్లి సతీష్, హార్వెస్టర్ యజమానులు, ఆపరేటర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం



**పాలకుర్తి, మే 02(జనంసాక్షి)** కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాల ఫలితంగానే ప్రజలసమస్యలు పరిష్కారమవుతున్నాయని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు భూక్యా చందూ నాయక్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకన్న ఇటీవల మృతి చెందగా, ఆయన స్మారకార్థం కుటుంబ సభ్యులు నిర్మించిన స్మారక స్తూపాన్ని చందూ నాయక్ ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిదిగా చందూ నాయక్ హాజరై మాట్లాడుతూ చిన్న వయసులోనే సీపీఎం పార్టీలో చేరి పార్టీని బలోపేతం చేయడంలో వెంకన్న ముఖ్య పాత్ర పోషించాడని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ఉపాధి అవకాశాలు లేక యువత నిర్వీర్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ చాప కింద నీరులా కాషాయ మయం చేస్తుందని విమర్శించారు. రైతులు, కార్మికుల వ్యతిరేక విధానాలను ఈ రెండు ప్రభుత్వాలు అవలం బిస్తున్నాయని విమర్శిం చారు. సభలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య, ముస్కు ఇంద్రారెడ్డి, సోమసత్యం. అశోక్ బాబు. సర్పంచ్ గణపురం రేణుక సురేష్, ఉప సర్పంచ్ బాల వేణి సోమయ్య. మాజీ సర్పంచులు మంద సోమయ్య. జలగం కుమారస్వామి, మాసంపల్లి నాగయ్య, చిట్యాల మధు. వేల్పుల కొమురయ్య. వేల్పుల వేణు. తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, మే 02 ( జనం సాక్షి )** :ప్రజల భాగస్వా మ్యం, ప్రజాప్రతినిధుల సహకారం తో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందిననియోజకవర్గంగా తీర్చిదిద్ద డమే సంకల్పం గా ముందుకు వెళ్తున్నానని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం లోని సిరిపురం గార్డెన్స్ లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటు చేసిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను ప్రజలకు చేరు వ చేసేందుకు ఏర్పాటు చేసిన చక్కని కార్యక్రమం అని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలలో ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలియజేసే అవకాశం వచ్చిందని అన్నారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చెపట్టి న నాటి నుండి 3అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అందులో మొదటిది రైతు సంక్షేమం, రైతుకు అండగా నిల వాలని, వ్యవసాయాన్ని పండుగ చేయాలనే ఉద్దేశ్యంతో రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, సన్నాలకు బోనస్, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యంకు మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. రెండోది మహిళా సంక్షేమం రాష్ట్రంలో మహిళా సాధికారాతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోం దని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణం, గృహ అవసరాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణి, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సులు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించి కోటి మంది మహిళలను కొటశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్ల డించారు. మూడోది పేద వర్గాల సంక్షేమం ఆర్థిక పరమైనఇబ్బందులు ఎదుర్కొంటూనే పేద వర్గాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లోనే పేద ప్రజలు దురదృష్టవశాత్తు కుటుంబ పెద్ద ను కోల్పోతే వారికి 15రోజులలో 5లక్షలు ఆర్థిక సహాయం అందించే విధంగా రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డు కలిగిన కోటి 15లక్షల కుటుంబాలకు ఇందిరా కుటుంబ భీమా పథకాన్ని అమలు చేయ నున్నట్లు తెలిపారు. అలాగే 2లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు ఇందులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ వితంతు మహిళలకు మొదట గా పెన్షన్ అందించనున్నట్లు తెలిపారు. దింతో పాటు ఈ విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గం లో అత్యధిక వరి, మొక్కజొన్న దిగుబడి వచ్చింది అంటే అందుకుకారణం గోదావరి జలాలురావడం వల్లేనని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి నియోజకవర్గ అభివృద్దే ఎజెండగా పని చేస్తున్నాని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గం లోని ఏ గ్రామానికి వెళ్లిన ఎదో ఒక అభివృద్ధి పను లు జరుగుతున్నాయని అన్నారు. ప్రతీ గ్రామంలో పేద ప్రజల స్వంత ఇంటి కళను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని తెలిపారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మీ మీ గ్రామాలలో, వార్డులలో అభివృద్ధి చేసేందుకు పనులు చేసేందుకు నిధులు తీసుకువచ్చే బాధ్య త తనదని నిజాయితీగా అమలు చేసే బాధ్యత మీదనిఅన్నారు .ఈకార్య క్రమంలో ఆర్డీవో వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారు జోడు రాంబాబు, స్టేషన్ ఘనపూర్ మున్సి పల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య , చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు,తహసీల్దార్లు,ఎంపిడివోలు, వివిధ శాఖల డీఈలు, ఏఈలు, సర్పంచులు, కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతు లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఎండల్లో మాడిపోతున్నా ప్రభుత్వానికి సోయి లేదా

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**దేవరుప్పుల, మే 02 (జనంసాక్షి)** రైతులు తాము పండించిన ధాన్యా న్ని మార్కెట్లో పోసి, కాంటాలు కాక నెలలో కొద్ది రోడ్లపై పడిగాపులు కాసి.ఎండల్లో మాడిపోతున్న ప్రభుత్వానికి సోయి లేకుండా పోయిందని. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. శనివారం దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ శ్రేణులతో, సమావేశమై రైతు సమస్యలపై స్పందిస్తూ, వడ్లు, మొక్కజొన్నల కొనుగోలులో జరుగుతున్న ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మే 6న వరంగల్లో జరిగే రైతు సభకు రైతులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి. మండల అధ్యక్షుడు తీగల దయాకర్. మండల నాయకులు బస్వా మల్లేశం. కొల్లూరి సోమయ్య. చింత రవి. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించడమే బాల భరోసా కార్యక్రమ ఉద్దేశ్యం

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్



**మహబూబాబాద్ బ్యూరో, మే 02(జనం సాక్షి):** శనివారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ అధ్యక్షతన ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న "బాల భరోసా కార్యక్రమం అమలు పై సమగ్రంగా చర్చించారు. ఈ బాల భరోసా కార్యక్రమం 27 ఏప్రిల్ 2026 నుండి ప్రారంభమై, అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవుతున్న ప్రీ-స్కూల్ పిల్లల ఆరోగ్య అభివృద్ధిని మెరుగుపరచడం లక్ష్యంగా చేపట్టబడింది. మొదటగా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలను ప్రాథమికంగా పరిశీలించి, అభివృద్ధి లోపాలు ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. అలాంటి పిల్లలను ఆర్‌బీఎస్‌కే బృందాలకు రిఫర్ చేయగా, ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలు మరింత సవివరంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు. ఈ విధంగా చిన్నపిల్లల్లో ఉన్న ఆరోగ్య సమస్యలను తొందరగా గుర్తించి, సమయానికి చికిత్స అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బీఎస్‌కే సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు ఇవ్వబడినవి. అన్ని బృందాలు సమన్వయంతో పనిచేసి, అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్య పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఎంహెచ్‌ఓ సూచించారుఈ కార్యక్రమం లో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ లక్ష్మి నారాయణ, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెచ్ ఈ ఓ కే ఎల్ యన్ స్వామి, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం



**నస్పూర్(జనంసాక్షి):** సీసీసీ నస్పూర్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మంచిర్యాల రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం దాని దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు, యువత, విద్యార్థులు తమతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులను కూడా మాదకద్రవ్యాల దుష్ప్రభావాల నుండి కాపాడే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా ప్రభావితమవుతాయని వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా రామగుండం పోలీసులకు తెలియజేయాలని కోరారు. అందిన సమాచారం ఆధారంగా వెంటనే చర్యలు తీసుకొని డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బంది విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారని, గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుంటున్నారని తెలిపారు. మత్తుకు బానిసలైన వ్యక్తులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా నియంత్రించగలమని, అందరూ అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జిల్లా వెల్ఫేర్ అధికారి రహూఫ్, మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, వివిధ విభాగాల ఇన్స్పెక్టర్లు, నార్కోటిక్స్ పెద్దపల్లి విభాగం ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, నస్పూర్ ఎస్ఐ ప్రశాంత్, హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి పర్యటన పై ఏర్పాటుకు సిద్దంగా ఉండాలి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 02(జనంసాక్షి ):** జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడి హేట్టి గ్రామం వద్ద ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని రాష్ట ముఖ్యమంత్రి , మంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నత అధికారుల పర్యటన త్వరలో ఉన్నందున పూర్తీ స్థాయి ఏర్పాట్లకు సిద్దంగా వుండాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్ల పై అధికారు తో నిర్వహించిన సన్నాహాక సమావేశం లో ఎస్ పి నితికా పంత్ , అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్ ,యం.డెవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్ డి ఓ లోకేశ్వర్ రావు, తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ముఖ్య మంత్రి పర్యటన కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రణహిత నది పై బరాజ్ నిర్మాణ ప్రాంతానికి పర్యటించే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లకు సిద్దంగా వుండాలని కలెక్టర్ అన్నారు. హెలిపాడ్, బాంకేడ్లు, వేదిక, వి ఐ పి, వి వి ఐ పి,గ్యాలరి, అధికారుల పాసులు, మీడియా పాసులు, పారిశుధ్య పనులు త్రాగు నీరు, వి ఐ పి , వి వి ఐ పి లకు త్రాగు నీరు, అల్పాహారం, బోజనాలు, ప్రజలకు త్రాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, వేదిక అలంకరణ, మెడికల్ సిబ్బంది క్యాంపులతో సిద్దంగా వుండాలని,విద్యుత్తు సరఫరా ప్రత్యామ్నాయంగా జనరేటర్ అందుబాటులో వుండేలా చర్యలు,పర్యటన లో ఎలాంటి లోపాలు జరుగకుండా ఏర్పాట్లను సిద్దం చేయాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు




**ఆత్మకూర్, మే 2 (జనం సాక్షి):** ప్రొఫెసర్ జయశంకర్ రాజేంద్ర నగర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని 27.04.2026 నుండి 22.05.2026 వరకు వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రోజున ఆత్మకూరు గ్రామం మండలంలోని రైతు వేదిక లో నిర్వహించడం అయి నది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల వరంగల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లైన డాక్టర్ కోటా శివకృష్ణ, నరేందర్ జన్ను పాల్గొన్నారు. డాక్టర్ కోట శివకృష్ణ రైతులకు వివిధ పంట లోని ఎరువుల యాజమాన్యంలో తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు, యూరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలను అలాగే సుస్థిర ఆదాయం సమకూర్చుకునే మార్గాలను వివరించారు. శాస్త్రవేత్త నరేందర్ జన్ను నేల ఆరోగ్యాన్ని కాపాడడానికి పంట వ్యర్ధాలను కాల్చకుండా భూమిలో కలియ దున్ని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాల్సిందిగా పలు సూచనలు చేశారు. సేంద్రియ వ్యవసాయం, నీటి యాజమాన్యం చేస్తూ అధిక దిగుబడులను పొందే విధానాలను రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో సౌమ్య మండల వ్యవసాయ విస్తరణ అధికారి వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదిత్య, గణేష్ మరియు రైతుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరంగల్ గడ్డపై కాంగ్రెస్ వంచనను ఎండగడదాం



**పెద్దవంగర మే 02(జనం సాక్షి )** రైతు డిక్లరేషన్ పేరిట రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ నమ్మకద్రోహంపై బీఆర్ఎస్ సమర శంఖంను విజయంతం చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ. మే 6న వరంగల్ రైతు సదస్సును విజయవంతం చేద్దాం రైతు ఏడుస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి కనబడటం లేదా పంట పండితే రైతుకి లాభం లేదు ఇంత చేతకాని పాలన ఎందుకు చేస్తున్నారు రైతు కష్టానికి ధర లేకపోతే, ఆ ప్రభుత్వానికి విలువ ఏంటి రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుంది... రైతులను మర్చిపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలు కాదు రైతుకి జీవనం కావాలి రైతు చెమటే రాష్ట్రానికి బంగార దాన్ని కాపాడలేకపోతే సిగ్గు పడాలి పాలన అంటే పోస్టర్లు కాదు... పొలాల్లో ఫలితం కనిపించాలిఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తొర్రూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేతిరెడ్డి సోమనరసింహ రెడ్డి, మండల నాయకులు శ్రీరాం సుధీర్, సర్పంచ్ దంతాలపల్లి పరశురాములు, మాజీ సర్పంచ్లు సల్దండి సుధాకర్, చింతల భాస్కర్, మాజీ ఎంపీటీసీ పసులేటి వెంకటరామయ్య, సుదగని రామ్మూర్తి, జాటోతు వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరుట్ల వెంకట్ రెడ్డి, బొమ్మిడి కృష్ణ రెడ్డి, చిలుక బిక్షపతి, మాంకాళి యాకయ్య తదితరులు పాల్గొనారు..

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### సబ్ కలెక్టర్ మనోజ్



**బెల్లంపల్లి మే 2, (జనంసాక్షి)** అర్హులందరికీ సంక్షేమ పథ కాలు అందిస్తామని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. శనివారం ఆయన బెల్లంపల్లి మండలం కన్నాల ఆర్పీ గార్డెన్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నియోజకవర్గ స్థాయి గ్రామసభ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్లాగ్ షిప్ కార్యక్రమము, ఇందిరా మహిళా శక్తి, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, గ్యాస్ సబ్సిడీ, తెల్ల రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ అర్హులైన ప్రజలందరికి అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం వివిధ శాఖల, గ్రామ పంచాయితీ, మండల స్థాయి అధికారులు హాజరై నియోజకవర్గ అబివృద్ధి నివేదిక గూర్చి వివరించారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ మున్సిపల్ కమిషనర్ జె సంపత్ రెడ్డి, తహశీల్దార్ కృష్ణ, గ్రామ, మండల స్థాయి అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్లో కోఆప్షన్ సభ్యుల ఎంపిక




**నిర్మల్ అర్బన్, మే 02 :(జనంసాక్షి)** నిర్మల్ జిల్లా మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి అధ్యక్షతన పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలు, మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా మున్సిపల్ పాలకవర్గం నలుగురు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. మైనార్టీ వర్గం నుండి అస్మా బేగం, నోమన్ అలీ, బీసీ వర్గం నుండి మేడారం అపర్ణ, జనరల్ విభాగం నుండి గాజుల రవిని కోఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేశారు.నూతనంగా ఎన్నికైన సభ్యులకు చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి అభినందనలు తెలియజేస్తూ, ప్రజాసేవలో చురుకుగా పనిచేసి పట్టణ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రవిబాబు, డీఈ హరి భువన్, మేనేజర్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు అధికారిని సన్మానించిన బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కనకం రమేష్



**స్టేషన్ ఘన్పూర్, మే 02 ( జనం సాక్షి )** :స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో ఉన్నటువంటిజూనియర్ సివిల్ జెడ్జ్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ కు పర్మినెంట్ అధికారిగా శివలీల బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కనకం రమేష్, బార్ అసోసియేషన్ సభ్యులు పూల మాల,బోకెతో స్వాగతం పలికి శాలువతో సన్మానిం చారు. నూత నంగా వచ్చిన అధికారికి ముందుగా స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కనకం రమేష్ మాట్లాడుతూ కోర్టు కి పర్మినెంట్ అధికారి రావడం ఎంతో సంతోషంగా ఉందని ,2019 వ సంవత్సరం నుండి ఉమ్మడి వరంగల్ నుండి కేసులు హన్మకొం డ జిల్లాకు మారడం జరిగిందని,అదేవిధంగా కొత్త జిల్లాగా ఏర్పడ్డ జనగామ జిల్లాకు కేసులు ట్రాన్స్ఫ ర్ కావడం జరిగిందని స్టేషన్ ఘన్ పూర్ కు కోర్టు వచ్చిన సందర్భంగా మళ్లీ గన్ పూర్ కు కొత్త నెంబ ర్స్ కేసులకు ఇవ్వడం జరిగిందని ఇలా చాలా సంవత్సరాల నుండి కక్షిదారులు అనేక ఇబ్బందు లు పడ్డారని అన్నారు. ఇకనుండి అలాంటి ఇబ్బం దులు లేకుండా రెగ్యులర్ అధికారిని రావడం హర్షించ దగ్గ విషయం అని,రెగ్యులర్ ఆఫీసర్ రావడానికి సహకరించిన జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిభకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రధాన కార్యదర్శి మునిగాల రవీందర్, షన్మా కుమారి, శ్రీనివాస్,గుర్రపు బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాల్ నాయక్ తండాలో బీటీ రోడ్డు పనులు ప్రారంభం



**చెన్నారావుపేట, మే 02( జనం సాక్షి):** మండలంలోని కాల్ నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని బాల్ నాయక్ తండాలో బీటీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ లావుడ్య తిరుపతి, చెన్నారావుపేట కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఆవుల రాములులు ప్రారంభించారు. శనివారం నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో బీటి రోడ్డు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు పనులను తండవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాల్ నాయక్ తండ గ్రామ ఉపసర్పంచ్ లావుడ్య స్వామి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అంగోతు గోవిందు, కాల్ నాయక్ తండ వార్డు సభ్యులు గుగులోతు స్వామి, కోనాపురం గ్రామ ఉపసర్పంచ్ మండల నరసింహారాములు, వార్డు సభ్యులు పోతరాజు లిట్టు, ఉప్పునుతుల లింగమూర్తిచారి, గ్రామ సీనియర్ నాయకులు ఎడ్ల నారాయణరెడ్డి, పురం మల్లయ్య, కళ్లెపు రవీందర్, గ్రామస్తులు అజ్మీర ప్రశాంత్, లావుడ్య రాములు, బాదావత్ సీత, లావుడ్య విజేందర్, లావుడ్య దేవరాజు, లావుడ్య వెంకన్న, బాదావత్ జాన, లావుడ్య శ్రీను, లావుడ్య నర్సింహా, అంగోతు రవి, గుగులోతు లచ్చిరామ్, లావుడ్య వాగ్య, బానోతు నాగన్న, రైతులు దొంతి మధు, పరికి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులు కర్షకులు ఏకం కావాలి

### 4 లేబర్ కోడ్స్ ల రద్దుకై ఉద్యమించాలి

### సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 02(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సెమినార్ లో సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున కార్మిక, కర్షక విధానాలను వ్యతిరేకించాలనీ,8 గంటల పని దినాల కోసం పోరాడాలనీ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ల రద్దుకై ఉద్యమించాలనీ,అదివాసి హక్కులకై పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వ విధానాలు సంక్షోభపూరిత నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క తీవ్రమైన దాడులకు,సామ్రాజ్యవాద ఆధిపత్య దాడులకు వ్యతిరేకంగా పోరాడుతూ, తమ హక్కులు, జీవనోపాదీ గౌరవానికి పాటుపడాలని అన్నారు. శ్రామికవర్గ అంతర్జాతీయవాదాన్ని సమర్థిస్తూ, దోపిడీ, వివక్ష,యుద్ధానికి వ్యతిరేకంగా, అలాగే శాంతి, ప్రజాస్వామ్యం, మెరుగైన జీవన పరిస్థితుల కోసం కార్మికులు చేస్తున్న పోరాటాలకు మన సంఘీభావాన్ని తెలియజేస్తున్నాము అని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యల ఉమ్మడి వేదిక కింద గత సంవత్సరంలో రెండు అత్యంత విజయవంతమైన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలు జరిగాయి అని అన్నారు. ఈ సమ్మెలలో భాగస్వాములైన, దేశవ్యాప్తంగా అన్ని రంగాలలో నిరంతరాయంగా పోరాటాలను కొనసాగించిన భారత కార్మిక వర్గానికి సిఐటియు అభినందనలు తెలియజేస్తోందనీ తెలిపారు. దీనికి కొనసాగింపుగా, ఉత్తర భారతదేశంలోని బరౌని, పానిపట్ నుండి గురుగ్రామ్, నోయిడా, ఫరీదాబాద్, సూరత్ వరకు ఉన్న పారిశ్రామిక ప్రాంతాలలో,వందలాది ఇతర పారిశ్రామిక కేంద్రాలలో ప్రతిఘటన, ధిక్కార పిలుపు మరింత ఉధృతంగా, వీరోచితంగా కొనసాగుతోంది అని అన్నారు. తెలంగాణ, కర్ణాటకలతో సహా దక్షిణ భారతదేశంలో, స్థిరమైన కనీస వేతనాలు, ఎనిమిది గంటల పనిదినం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, గౌరవం వంటి కార్మికుల ప్రాథమిక హక్కులు, అర్హతలపై కొనసాగుతున్న దాడికి వ్యతిరేకంగా పదుల వేల సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు పోరాటానికి దిగారు అని అన్నారు. క్రూరమైన అణచివేత, అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, ప్రభుత్వ బెదిరింపులు ఉన్నప్పటికీ, కార్మికులు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు అని అన్నారు. కార్మికవర్గం యొక్క పోరాట సంకల్పాన్ని అణచివేయలేరని వారు మరోసారి నిరూపించారు అని అన్నారు. దేశ సంపదను, వనరులను సృష్టిస్తున్న కార్మికుల ప్రాథమిక మానవ హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటాలపై ప్రభుత్వ యంత్రాంగం ప్రయోగిస్తున్న ఫాసిస్టు, నిరంకుశ అణచివేతను సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. శ్రామిక ప్రజల ఈ ప్రాథమిక హక్కులపై జరుగుతున్న ఈ దాడులు ప్రస్తుతం ఉన్న చట్టాలను, రాజ్యాంగ నిబంధనలను అహంకారపూరితంగా ఉల్లంఘించడమే, కేంద్రంలోను, అనేక రాష్ట్రాలలోను ప్రభుత్వ యంత్రాంగం సిగ్గులేకుండా ఆయా ప్రభుత్వాలకు విధేయ సేవకుల్లాగా వ్యవహరిస్తూ రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తున్నాయి అని అన్నారు. కార్పొరేట్ సంస్థలు కార్మికులను దోచుకోవడాన్ని సమర్థిస్తూ కార్మికుల పైన దాడులు చేస్తున్నారు అని,వారికి అండగా నిలబడుతున్న నాయకులను నిర్బంధిస్తున్నారు అని,ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు, బడా పెట్టుబడిదారులకు అనుకునంగ చేస్తున్న ఈ క్రూరమైన దాడికి, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగే ఈ పోరాటాన్ని ముందుకు నడిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్,తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నంది పద్మ, సీఐటీయూ నాయకురాలు స్వరూప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, పేపర్ మిల్లు మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూశన రాజన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టికానంద్, కార్తీక్, కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్,తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు



### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, మే 2, (జనంసాక్షి )**
నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో కలుపు మందులు, నకిలీ, నిషేధిత విత్తనాల నియంత్రణపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మీరటి రాజేశ్వరి లతో కలిసి హాజరై వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితులలో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు సాగు చేసే పంటల దిగుబడికి అవసరమైన మెలకువలను అందించడంతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన, నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిషేధిత కలుపు మందుల వినియోగం, తత్ఫలితంగా కలిగే నష్టాలపై వివరించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు నియంత్రణపై టాస్క్ ఫోర్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, విత్తన, క్రిమిసంహారక విక్రయ డీలర్లు, దుకాణాలను తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించని వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, పంట సాగులో శాస్త్రీయ, సేంద్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ......నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయం, వినియోగం నియంత్రణపై సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. గత సంవత్సరం నకిలీ విత్తనాల లభ్యత ఆధారంగా నకిలీ విత్తనాలను నిల్వచేసే ప్రాంతాలను గుర్తించి తనిఖీలు చేపట్టాలని తెలిపారు. విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించే దుకాణాలను తనిఖీ చేయాలని, నిబంధనలను పుల్లంగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు

**హనుమకొండ ప్రతినిధి మే 2 (జనం సాక్షి) :**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రజావాణి" కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శనివారం సర్క్యులర్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఎంఎస్ నెంబర్.3, ప్లానింగ్ శాఖ, తేదీ 30-04-2026 ప్రకారం ప్రజావాణి కార్యక్రమాన్ని సంస్థాగతీకరణ, వికేంద్రీకరణ మరియు సమగ్రతతో అమలు చేయనున్నట్లు తెలిపారుప్రతి సోమవారం జిల్లా స్థాయిలో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం/జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించబడుతుంది. అలాగే రెవెన్యూ డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్/ఆర్డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు.అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.డివిజన్ స్థాయి అధికారులు కూడా సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, ప్రతి వినతికి ప్రత్యేక రిఫరెన్స్ నంబర్ కేటాయించ బడుతుందని. అందిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించి, తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజల పట్ల సహానుభూతితో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని ఆదేశించారు.



# మంటలు అంటుకొని పామాయిల్ తోట దగ్ధం

**గూడూరు,మే02(జనంసాక్షి):** కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని అడవిలో మంట పెట్టడంతో దగ్గరలో ఉన్న ఫామ్ ఆయిల్ తోటకు మంటలు అంటుకొని సుమారు 80 వేల రూపాయల ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. బాధిత కౌలు రైతు తండా శ్రీహరి వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లాగూడూరు మండలంలోని నాయకపల్లి శివారు బంచరాయ్ తండా సమీపంలో తాను ప్రభుత్వ ప్రోత్సాహకంతో ఐదు ఎకరాల్లో పామాయిల్ సాగు చేపట్టి లక్షల రూపాయల పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు.అయితే శనివారం జరిగిన అగ్ని ప్రమాదం ద్వారా పంట చేతికి వచ్చే సుమారు 50 పామాయిల్ మొక్కలు దగ్ధమయ్యాయని ఈ అగ్నిప్రమాదం కారణంగా సుమారు రూ.80 వేల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల్లో అజాగ్రత్తగా నిప్పు పెట్టడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని,బాధిత రైతుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తక్షణ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని స్థానిక రైతులు, ప్రజా ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ ప్రాంతాల్లో నిఘా పెంచాలని కోరుతున్నారు.



# టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ స్టేట్ జనరల్ సెక్రటరీగా రోహిత్ సాదు



**పరకాల, మే 2 (జనం సాక్షి):**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మెడికల్ మరియు హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డా రోహిత్ సాధుని నియమిస్తూ టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ స్టేట్ ఛైర్పర్సన్ డా రాజీవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హన్మకొండ జిల్లా పరకాల పట్టణానికి చెందిన రోహిత్ సాదు ప్రస్తుతం ఇండియన్ అస్సోసియేషన్ అఫ్ ఫిజియోథెరపీ జిల్లా కన్వీనర్ గా, నేషనల్ హ్యూమన్ రైట్స్(ఎన్జీఓ) స్టేట్ కమిటీ మెంబర్ గా పని చేస్తున్నారు. కాగా పరకాల పట్టణంలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ చేస్తున్న సేవలను గుర్తించి హెల్త్ విభాగంలో రాష్ట్ర పదవి ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నత పదవి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని హన్మకొండ లోని అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా రోహిత్ కు ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించి శుభాకాంక్షలు తెలియచేశారు. నిబద్ధతతో పని చేసి పార్టీ అభివృద్ధికి దోహదం చేయాలనీ సూచించారు. తనకు ఈ అవకాశం రావడానికి సహకరించిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్, హెల్త్ మినిస్టర్ దామోదర రాజానర్సింహ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, డీసీసీ ప్రెసిండెంట్ ఇనాగాల వెంకటరాంరెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ స్టేట్ ఛైర్పర్సన్ డా రాజీవ్, ఇతర ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి తన వంతు కృషి చేస్తానని రోహిత్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో మునిసిపల్ ఛైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, డా రమేష్, డా రాకేష్, డా సాయికుమార్ లు ఉన్నారు.

# మద్యము మత్తులో తిమ్మేట గులుకలు మింగి యువకుడు ఆత్మహత్య.



**మహదేవపూర్: మే 2 (జనంసాక్షి)** . మండల కేంద్రంలోని నేతకానివాడికి చెందిన చిలుముల శ్రీనివాస్ (35 ).అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటలకు మద్యం మత్తులో తిమ్మిట గుల్కలు మింగి యువకుడు ఆత్మహత్య. ఎస్సై పవన్ కుమార్ తెలిపిన వివరాల మేరకు చిలుముల శ్రీనివాస్ అనే యువకుడికి వివాహము జరిగి ఇద్దరు పిల్లలు సంతానము కలిగి భార్య భర్తల మధ్య మనస్పర్ధలతో గత సంవత్సరం క్రితం భార్యాపిల్లలతో సహా పుట్టింటికి వెళ్ళగా అప్పటినుండి చిలుముల శ్రీనివాస్ మద్యనికి బానిసాఅయి తిరుగుతుండేవాడని శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయములో తిమ్మేట గులుకలు మింగడంతో అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మహదేవ పూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అతని పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం నాడు ఇది చెందేని డాక్టర్లు నిర్ధారించడంతో మృతుడు సోదరుడైన రామచందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బాధిత కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అండ




**పాలకుర్తి. మే 02 (జనంసాక్షి)** మండల కేంద్రానికి చెందిన యాట సరిత కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, శనివారం బాధిత కుటుంబ సభ్యులను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్. కార్యదర్శి జిడి హరీష్. సందర్శించి పరామర్శించి, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నవయసులో తల్లిని కోల్పోవడం బాధాకరమని, పిల్లలకు ట్రస్ట్ నుండి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. పెళ్లిరోజు సందర్భంగా ఈ కుటుంబానికి సహకా రాన్ని అందించిన తాల్లపెల్లి గీతా- రమేష్ దంపతు లకు ట్రస్ట్ తరుపున కృతజ్ఞతలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి, మృతుడి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్ల ల పట్టివేత



**జనం సాక్షి 2 ఎలుకతుర్తి** ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి లోని గ్రామ శివారులో ఉన్నటువంటి వాగులో నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్ పట్టుకూనట్లు ఎస్సై నరసింహారావు అన్నా రు ఆ యొక్క ట్రాక్టర్ టేల కందుగుల గ్రామానికి చెందిన కొత్వాల రాజు అక్రమంగా ఇసుక తరలిస్తున్న అనే సమాచారంతోరాజు అనే వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని రెండవ ట్రాక్టర్ కోతుల నడుమ గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మరొక ట్రాక్టర్ ను పట్టుకొని కోతుల నడుమ గ్రామానికి చెందిన గండికోట వెంకటయ్య పై కూడా కేసు నమోదు చేయడం జరిగినద నీ ట్రాక్టర్లను ట్రక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై నరసింహ రావు అన్నారు వారితోపాటు హెడ్ కానిస్టేబుల్ విటల్ ఎ ఎస్సే శంకర్ కానిస్టేబుళ్లు ఉన్నారు

# సేంద్రీయ పద్ధతి ద్వారా పంటలు పండించాలి

## జీవన్ రెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి



**-గోవిందరావుపేట (జనంసాక్షి ). 02.05.26**సేంద్రీయ పద్ధతుల ద్వారా పంటలను పండించాలని జిల్లా ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రంగాపూర్,బాలాజీనగర్. సంద్రగూడెం,కర్లపల్లి,లక్ష్మీపురం గ్రామాలలో అజీం ప్రేంజీ ఫౌండేషన్ ఏపీఎఫ్ వన సమాఖ్య ఆద్వర్యం లో 300 మంది రైతులచే ప్రకృతి వ్యవసాయం ను అభివృద్ధి చేయించడం జరుగుతుంది.ఆ రైతులకు సుమారు 100 మంది కి 1000 రూపాయల విలువైన విత్తనాల కిట్లు ములుగు జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రంగాపూర్ గ్రామంలో కూరగాయ విత్తనాల పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ మోడెం సమ్మక్క ప్రారంబించగా ములుగు ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి జీవన్ రెడ్డి చేతుల మీదుగా కూరగాయ విత్తనాల కిట్లను పంపిణి చేశారు. హెచ్ ఈ ఓ జీవన్ రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడి మరియు అంతర పంటలు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చునని తెలిపారు.తెలంగాణా ప్రభుత్వం మరియు ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో రైతులకు ఉచితంగా హైబ్రీడ్ కూరగాయ విత్తనాల కిట్లు అందిస్తున్నామని చెప్పారు. వనసమాఖ్య సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రమేష్ మాట్లాడుతూ ప్రకృతి సేద్యంలో బాగంగా ఈ కూరగాయల పంటలను వేసుకోవాలి వీటిని రసాయన ఎరువులు,మందులు వాడకుండా సేంద్రియ పద్ధతుల ద్వారా పండించుకోవాలి ఇలాచేయడం వలన పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి.పంట నాణ్యత పెరుగుతుందనీ రైతులు ఆరోగ్యంగా ఉంటారని తెలియజేసారు.కూరగాయ విత్తనాలు రైతులకు అందించినందుకు న్యాచురల్ ఫార్మింగ్ రైతు మాజీ సర్పంచ్ వాసం కన్నయ్య,ఉద్యానవన శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ జీవన్ రెడ్డి,వనసమాఖ్య సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గాందర్ల రమేష్ ,ఫీల్డ్ ఆర్గనైజేర్ చేల రమేష్ రైతులు పాల్గొన్నారు.

